మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జనవరి 10: 2024-25 విద్యాసంవత్సరానికి గాను తెలంగాణ మోడల్ స్కూళ్లలో 7వ తరగతి నుంచి 10వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 7న జరిగే ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. తెలంగాణఎంఎస్.సిజిజి.జివోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 12 నుంచి 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

రైతు వేదికలు వెలవెల!

- జిల్లాలో నిరుపయోగంగా రైతువేదికలు
- మందుబాబులకు అడ్డాలు.. కన్నెత్తి చూడని అధికారులు
- అభాసుపాలవుతున్న రైతు బంధు కమిటీలు
- నూతన ప్రభుత్వం దృష్టి సారించాలని రైతుల వేడుకోలు





● జాగిర్యాల్‌లో వృథాగా రైతువేదిక భవనం

భీమ్‌గల్ రూరల్, జనవరి 10: రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికలు వెలవెలబోతున్నాయి. రైతులతో సమావేశాలను ఏర్పాటు చేస్తూ వారికి పంటల సాగు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మించిన రైతు వేదికలు నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. రైతు వేదికల నుంచే మండల స్థాయి అధికారులు (ఏఈవో)లు నిత్యం విధులు నిర్వహించాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ జిల్లాలో ఏ ఒక్క చోట ఇలాంటి పరిస్థితి కనిపించడమే లేదు. అధికారులు నెలల తరబడి అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇదే అదునుగా కొందరు మందుబాబులు అడ్డాలుగా మార్చుకొని మద్యం తాగుతూ వీరంగం సృష్టిస్తున్నారు. దీంతో రైతు వేదికల పరిసరాలు మద్యం సీసాలతో దర్శనమిస్తున్నాయి. అయితే చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రక్షణ లేకుండానే పోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏదో అయితే రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వమైనా రైతు వేదికలను వినియోగించాలని రైతులు కోరుతున్నారు.

108 క్లస్టర్లలో భవన నిర్మాణాలు

జిల్లా వ్యాప్తంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 108 క్లస్టర్లలో 2020లో రైతువేదిక నిర్మాణాలను చేపట్టింది. 5 వేల మంది రైతులున్న ప్రాంతాలన్నీ ఒక క్లస్టర్‌ను ప్రాతిపదికగా ఎంపిక చేసి 18 మండలాల్లో నిర్మాణాలు చేపట్టింది. అయితే రైతు వేదికల నిర్మాణాల కంటే ముందే 2018 మార్చిలో జిల్లా వ్యాప్తంగా రైతుబంధు కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లా, మండల, గ్రామస్థాయిల్లో అధికార పార్టీకి చెందిన నాయకులు, రైతులే ఉండడంతో వందశాతం ఫలితాలు వస్తాయని అప్పటి ప్రభుత్వం భావించింది. కానీ ఇప్పటి వరకు రైతులకు ఎటువంటి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం లేదు.

నిర్వహణ గాలికి


ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన రైతువేదికల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. విత్తనాలు సాగుచేసే దగ్గరినుంచి పంటను అమ్ముకునేవరకు రైతువేదికలలో భూసార పరీక్షలు, విత్తనాల ఎంపిక, ఎరువుల వాడకం విధానంతో పాటు ఆయా పంటల సాగుపై మెలకువలు రైతులు తెలుసుకునేందుకు వీటిని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మండల స్థాయిలోని అగ్రికల్చర్ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు సూచనలు చేయాలి. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులతో పాటు రైతుబంధు కమిటీ సభ్యులతో బృందాలను ఏర్పాటు చేసి రైతులను, రైతువేదికల దగ్గరకు వచ్చేలా కృషిచేయాలని ప్రభుత్వ నిబంధనలు వున్నాయి. భూసార పరీక్షలు చేస్తూ పంటల మార్పిడికి రైతులను ప్రోత్సహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అయితే వ్యవసాయ అధికారులు, రైతు బంధు సమితి సభ్యులు రైతులకు మొఖం కూడా చూపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతు అవగాహన సదస్సులు నిర్వహించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

> **వేదికలు నిరుపయోగంగా మారాయి..**
> **:చిన్న గంగాధర్, రైతు (బడాభీమ్‌గల్)**
>
> అప్పటి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా రైతువేదిక నిర్మాణాలు జరిగాయి. రైతు వేదికల్లో ఎటువంటి రైతు సమావేశాలు జరగడం లేదు. పంటల సాగుపై రైతు బంధు కమిటీలు గ్రామస్థాయిలో అవగాహన కల్పించడం లేదు. నూతన పంటల సాగు విధానంపై వ్యవసాయ అధికారులు సలహాలు సూచనలు చేయడం లేదు.
>
> **నిర్వహణ ఖర్చులు రావడం లేదు..**
> **: మల్లయ్య ఏడీఏ (భీమ్‌గల్)**
>
> గత ప్రభుత్వంలో నిర్మించిన రైతు వేదికల నిర్వహణ ఖర్చులు ఇప్పటి వరకు మంజూరు కాలేదు. కరెంటు బిల్లులు కూడా పెండింగ్‌లోనే వున్నాయి. రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహిస్తున్నాం. రైతులకు అందుబాటులో ఉంటున్నాము. నిర్వహణ కోసం ఎటువంటి గ్రాంట్ విడుదల కాలేదు.

ప్రతి రైతువేదికలో ఉండాల్సిన పరికరాలు కూడా అందుబాటులో లేవు. నిర్వహణ గాలికి వదిలివేయడంతో అలంకార ప్రాయంగా రైతు వేదికలు ఊరికి దూరంగా దర్శనమిస్తున్నాయి. అప్పుడప్పుడు మొక్కుబడిగా వ్యవసాయ శాఖ అధికారులు రైతువేదికల దగ్గరకు వెళ్లివస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు.

రైతు వేదికలకు తాళాలు

రైతులందరూ ఒకేచోట చేరి పంట సాగుపై చర్చించుకునేందుకు వీలుగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన రైతువేదికలు ఏళ్ల తరబడి తాళం వేసే కనిపిస్తున్నాయి. బాధ్యతలు అప్పగించినప్పటి నుంచి సంబంధిత ఏఈవోలు రైతు వేదికల నుంచే విధులు నిర్వహించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ అధికారులు రైతు వేదికల వైపు కన్నెత్తి చూడడమే లేదు. ఉపాధి హామీ, వ్యవసాయ శాఖ నిధులతో రైతువేదికల నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో రైతువేదిక నిర్మాణానికి 24లక్షల రూపాయలు వెచ్చించారు. భీమ్‌గల్ మండలంలో 14 వేల మంది రైతులు 35 వేల పైచిలుకు సాగుభూమి ఉంది. దీనికనుగుణంగా 5 వేల మంది రైతులున్న ప్రాంతాలన్నీ ఒక క్లస్టర్‌గా విభజించి మండలంలోని మెండోరా, ముచ్కూర్, జాగిర్యాల్, చేంగల్, గోన్‌గొప్పుల గ్రామాల్లో రైతువేదికల భవనాలు నిర్మాణాలు చేపట్టారు. అయితే రైతు వేదికల నిర్వహణపై మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. రైతువేదికలకు ప్రతినెలా వస్తున్న కరెంటు బిల్లులు, ప్రతినెలా క్లస్టర్ ఏఈవోలకు రావాల్సిన నిర్వహణ ఖర్చులు కూడా ప్రభుత్వం నుంచి రాలేదు. లక్షల వ్యయంతో నిర్మించిన రైతువేదికల నిర్వహణను కొత్త ప్రభుత్వం పట్టించుకొని వినియోగంలోకి తీసుకరావాలని రైతులు కోరుతున్నారు.





● డొంకేశ్వర్‌లో..



● మెండోరా రైతువేదిక భవనం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ

మైనార్టీలు విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

● ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ

బోధన్ రూరల్, జనవరి 10: మైనార్టీలు విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని, చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని అయేషా గార్డెన్‌లో పదో తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఎంఐఎం తరపున ఆల్ ఇన్ వన్ గైడ్స్ ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులను ద్దేశించి ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి నాదేండ్ల భాస్కర్‌రావుకు ఎంఐఎం పార్టీ అప్పట్లో పూర్తి మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. ఆయన హయాంలో మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు ఐదు వేల మందికిపైగా డాక్టర్లుగా మల్టీపుల్ హాస్పిటల్‌తో పాటు మారుమూల గ్రామాల్లో సైతం వైద్యం అందిస్తున్నారన్నారు. మైనార్టీలు రాజకీయంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే మైనార్టీ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని వారందరూ ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు ఎండీ షకీల్, నిజామాబాద్ డిప్యూటీ మేయర్ ఇద్రీస్‌ఖాన్, బోధన్ పట్టణ అధ్యక్షుడు ముషీర్‌బాబా, ఫ్లోర్ లీడర్ అబీబ్‌ఖాన్, ఖదీర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

> **మైనార్టీలను విద్యకు దూరం చేసేలా మోదీ సర్కార్ కుట్ర..**
>
> ఖిల్లా: మైనార్టీలను విద్యా రంగానికి దూరం చేసేలా మోదీ సర్కార్ కుట్ర చేస్తోందని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదో తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన ఆల్ ఇన్ వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఓవైసీ మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీల అభ్యున్నతిని బీజేపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ముస్లింలను చదువుకు దూరం చేసేందుకు కుట్ర పన్నుతుందని ఆరోపించారు. దేశంలోని అలీగడ్ యూనివర్సిటీని నిర్వీర్యం చేస్తోందన్నారు. అదే విధంగా దేశంలో కులమతాల మధ్య విద్వేషాలు లేపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్పుల మంజూరులోనూ కేంద్రంలోని బీజేపీ సర్కార్ కోత విధించిందన్నారు. అయినప్పటికీ ఎవరూ అధైర్య పడవద్దని, చక్కగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఓవైసీ కోరారు.



జోరుగా మట్కా

జిల్లాలో యథేచ్ఛగా దందా

- జిల్లాలో పడగ విప్పుతున్న మట్కా
- తరచూ వెలుగుచూస్తున్న కేసులు
- 17 మందిని గుర్తించిన పోలీసులు
- తాజాగా మాట్కా నిర్వాహకుడి అరెస్టు
- మట్కా నిర్వాహకుల వెనక కీలక నేతలు
- జిల్లాలో టాస్క్‌ఫోర్స్ దాడులతో వెలుగులోకి ఘటనలు

ఖిల్లా, జనవరి 10: జిల్లాలో విస్తరిస్తున్న మట్కా మహమ్మారి పోలీసులకు సవాలుగా మారుతోంది. సులువుగా డబ్బు చేతికి వస్తుందన్న ఆశతో ఈ వ్యసనానికి బానిసలై కొందరి జీవితాలు రోడ్డున పడుతున్నాయి. యథేచ్ఛగా కొనసాగిస్తున్న మట్కా నిర్వాహకులపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వరుస దాడులతో బెంబేలెత్తిస్తున్నారు. మట్కా నిర్వహణలో కీలక నేతల అండదండలు ఉన్నట్లు ట్రాస్క్‌ఫోర్స్ సిబ్బంది గుర్తించి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి కీలక నేతగా వ్యవహరించిన సదరు వ్యక్తి సులభంగా డబ్బును సంపాదించడానికి మట్కాను నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ నేత గతంలో జర్దాను అక్రమంగా నిలువ చేసి వ్యాపారం చేసినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. వీరికి గత ప్రభుత్వ ప్రజా ప్రతినిధుల సహకారం ఉండడం వల్ల మట్కా నిర్వహణ జోరుగా కొనసాగింది. ఎన్నో ఎళ్లుగా ఆన్‌లైన్ మట్కా నడుస్తున్నా పోలీసులు సైతం వారిని గుర్తించలేకపోయారు. పైగా అధికార పార్టీకి చెందిన నేతల జోలికి వెళ్తే ఎక్కడ తమ ఉద్యోగానికి ఎసరు వస్తుందోనని ఆ దిశగా నిఘా పెట్టడం మానేశారు.

మట్కాపై పోలీసు కమిషనర్ ప్రత్యేక నిఘా

ప్రస్తుతం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు జరగడంతో పాటు జిల్లాలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగనేవార్ మట్కాపై ప్రత్యేక నిఘా పెట్టారు. పోలీసు శాఖకు సంబంధం లేకుండా టాస్క్‌ఫోర్స్ బృందానికి ఈ పనిని అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖరరాజు సైతం నిక్కచ్చిగా వ్యవహరించడం వల్ల మట్కా నిర్వాహణపై వరుస దాడులు చేస్తున్నారు. గత వారం రోజుల్లోనే నాగారానికి చెందిన ప్రధాన నిర్వాహకుడైన శేఖ్ జమీర్ అహ్మద్‌ను పట్టుకున్నారు. దీని వెనుక ఉన్న వారి వివరాలను సేకరించారు. వివరాలను సేకరించిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారి కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలో సుమారు 17 మంది మట్కా నిర్వాహకులు ఉన్నట్లు గుర్తించిన టాస్క్‌ఫోర్స్ బృందం వారి కోసం ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని ఐదో టౌన్ పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. టాస్క్‌ఫోర్స్ బృందం వరుస దాడుల నేపథ్యంలో అందుకు సంబంధం ఉన్న ఏ-2 నుంచి ఏ-17 వరకు అజ్మీర్‌లో ఈనెల 18న జరిగే ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనేందుకు తరలివెళ్లినట్లు సమాచారం. వారి కోసం అక్కడికి ప్రత్యేక బృందాలు వెళ్లనున్నట్లు నగరంలో పలువురు చర్చించుకుంటున్నారు.



ఇటీవల టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్న మట్కా నిర్వాహకుడు

నగర శివారులో నిర్వహణ!

నగర శివారు ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు మట్కా ఆటను నిర్వహిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ బృందం సమాచారం సేకరించినట్లు తెలిసింది. ముఖ్యంగా నెహ్రూనగర్, వర్నీ, చంద్రశేఖర్ కాలనీ, నాగారం, జాన్కంపేట్, ఆటోనగర్ లాంటి ప్రాంతాల్లో మట్కాను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నారు. మహారాష్ట్ర కేంద్రంగా నడుస్తున్న మట్కాకు నాందేడ్, ఉమర్‌ఖేడ్, బిలోలి, భీడ్, అమరావతి, అకోల, ఉమ్రిలకు చెందిన మరి కొందరి సహకారంతో ఈ వ్యవహారం జోరుగా కొనసాగుతోంది. మట్కాకు సంబంధించిన వారు ఎవరెవరు ఉన్నారనే విషయంపై టాస్క్‌ఫోర్స్ బృందం డొంక తోడుతుండడంతో వారిలో కదలికలు వచ్చాయి. మట్కా నిర్వహిస్తూ గత ప్రభుత్వంలో కీలక నేతలుగా ఉన్న వారు తమను తాము కాపాడుకోవడానికి టాస్క్‌ఫోర్స్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కదలికలను గమనించిన వారు జిల్లా కేంద్రం నుంచి పరారీ అయినట్లు సమాచారం.

తాగునీటికి ఇబ్బంది లేకుండా పకడ్బందీ చర్యలు

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, జనవరి 10: జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశం మందిరంలో తాగునీటి సరఫరాపై బుధవారం కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు. రానున్న వేసవి సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన జరపాలన్నారు. జిల్లాలోని ఏ ఒక్క నివాస ప్రాంతంలో నీటి ఎద్దడి లేకుండా ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తు అవసరమైన చోట యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. ఆయా గ్రామాల వారీగా నీటి సరఫరా పరిస్థితిని పరిశీలించి వారం రోజుల్లో సమగ్ర నివేదికలు సమర్పించాలన్నారు. ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన సభల సందర్భంగా పలు చోట్ల మిషన్‌భగీరథ నీరు ఇంటింటికి సరఫరా కావడం లేదని ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారని ఈ తరహా ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రతి ఇంటికీ నీరు అందేలా వ్యవస్థను చక్కదిద్దాలన్నారు. ముఖ్యంగా అంతర్గత సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే వెంటనే వాటిని సరిచేయాలన్నారు. వేసవికాలం ఆరంభానికి ముందే నీటి సరఫరా వ్యవస్థను గ్రామాల వారీగా ఒకొక్క నివాసం వారిగా చక్కదిద్దాలన్నారు. గ్రామ సర్పంచులు, కార్యదర్శులను సంప్రదించి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. నివాస ప్రాంతాలతో ఆటు అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సమృద్ధిగా శుద్ధి జలాలు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. నీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రాజేంద్రకుమార్, ఈఈలు రాకేష్, నరేష్, డీఈలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామాల వారీగా నిర్వహిస్తాం

● కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

భిక్కనూరు, జనవరి 10: గతంలో మాదిరిగా కాకుండా ఇప్పటి నుంచి ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామాల వారీగా నిర్వహించడం జరుగుతుందని, తద్వారా గ్రామాల్లోని ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు అనుకూలంగా ఇబ్బందులు లేకుండా ఉంటుందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కామారెడ్డి నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అన్నిపార్టీల నాయకులకు కలుపుకుని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కేవలం ప్రజాప్రతినిధులు మాత్రమే పాల్గొనాలని, ప్రజా ప్రతినిధులకు ఆ గౌరవం దక్కాలని, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, మిగితా అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. నాయకులకు ఫొటోలతో, ఆడంబరాలతో పేరు రాదని కేవలం ప్రజలకు సేవ చేసినప్పుడు మాత్రమే పేరు, గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ గాల్ రెడ్డి తహసీల్దార్ శివప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ అనూష, ఎంపీటీసీ చంద్రకళ, జంగంపల్లి ఉపసర్పంచ్ భాస్కర్‌చారీ, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల అనుమతికి అధిక డబ్బులు తీసుకున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు

పెద్ద కొడప్‌గల్, జనవరి 9: మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణానికి గాను పంచాయతీ సిబ్బంది అధికంగా డబ్బులు తీసుకుని తక్కువ మొత్తానికి రశీదులు ఇచ్చారని లబ్ధిదారులు మంగళవారం జుక్కల్ ఎమ్మెల్యే తోటకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీకి ఎమ్మెల్యే రాగా గృహ నిర్మాణదారులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణదారులు మాట్లాడుతూ తాము డబుల్ బెడ్ రూం ఇంటి నిర్మాణం కోసం పంచాయితీ సిబ్బందికి అనుమతి కోసం వెళ్లే తమ నుంచి 14 వేల రూపాయల నుంచి 25 వేల రూపాయల వరకు తీసుకున్నారని, రశీదు మాత్రం 882 రూపాయలకు రశీదు ఇచ్చారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయంపై విచారణ చేయాలని ఎంపీడీవోకు ఆదేశించారు.

'ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేది కాంగ్రెస్'

పెద్ద కొడప్‌గల్, జనవరి 9: ప్రజలకు ఇచ్చిన మాటలకు కట్టుబడి ఉండేది కాంగ్రెస్ పార్టీయేనని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ పేర్కొన్నారు. బుధవారం పెద్ద కొడప్‌గల్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ.. ఎన్నికల హామీలలో భాగంగా కాంగ్రెస్ ప్రజలకు ఆరు గ్యారెంటీ పథకాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. అందులో నుంచి రెండు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తున్నామని, మిగతా నాలుగు పథకాలను 100 రోజుల్లో అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశరథం, ఎంపీడీవో రాణి, ఎంపీవో సూర్యకాంత్ పాల్గొన్నారు.

బీబీపేటలో సైబర్ క్రైంపై అవగాహన

బీబీపేట, జనవరి 10: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో ఎస్ఐ అనిల్ ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా ప్రయాణికులు బస్సులో రద్దిసందర్భంగా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గుర్తుతెలియని వారికి ఫోన్‌లో వచ్చిన ఓటీపీ షేర్ చేయకూడదని తెలిపారు. వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ధ్రువపత్రాలను వెంట పెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సొంత గూటికి మాజీ ఉప సర్పంచ్

దోమకొండ, జనవరి 10: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన ముత్తగారి శిరీష్‌గౌడ్ సొంత గూటికి చేరారు. హైదరాబాద్‌లోని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ శిరీష్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

బస్టాండ్ ప్రహరీ నిర్మాణానికి కొలతలు

దోమకొండ, జనవరి 10: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రహరీ నిర్మాణానికి బుధవారం ఆర్టీసీ డీఎం ఇందిరా, సర్వేయర్ రాకేష్ కొలతలు నిర్వహించారు. మ్యాప్ ప్రకారమే తాము ఆర్టీసీ నిధులు రూ.29 లక్షలతో వివిధ రకాల పనులను చేయడం జరుగుతందని డీఎం తెలిపారు. కాగా బస్టాండ్ తూర్పు నుంచి పడమరకు దక్షిణ భాగము యందు ఉన్న కాలనీవారికి దారి లేకుండా అవుతుందని ప్రజలు ఇబ్బందులు పడకుండా దక్షిణం దిక్కున 40 ఫీట్ల దారి వదిలి నిర్మాణం చేయాలని కాలనీ ప్రజలు కోరడంతో సర్పంచ్ నల్లపు అంజలి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 40 ఫీట్ల దారి వదిలి పనులు చేసే విధంగా ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సర్పంచ్ కలెక్టర్‌కు అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కల్లెడిలో మాట్లాడుతున్న జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మాక్లూర్,జనవరి10: పేదల కోసం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు కోరారు. బుధవారం మండలంలోని కల్లెడి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో జడ్పీచైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భవ, ఉజ్వలగ్యాస్, ప్రధానమంత్రి అవాస్ యోజన, తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి, సర్పంచ్ లావణ్య, వైస్ఎంపీపీ సుక్కి సుజాత, ఏపీఎం అనిల్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పంచులను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 10: ఈనెలాఖరుకు సర్పంచుల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించేంతవరకు ప్రస్తుత సర్పంచులను ఇన్‌చార్జి సర్పంచులుగా కొనసాగించాలని మాజీ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోర్త రాజేందర్ కోరారు. హైదరాబాద్‌లో సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్లు కోదండరాం, హరగోపాల్, మల్లురవి తదితరుల ఆధ్వర్యంలో కేసీఆర్ పాలనలో సర్పంచుల అప్పులు, ఆత్మహత్యలపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాజేందర్ మాట్లాడారు. గత ప్రభుత్వం పంచాయతీకి రావలసిన బిల్లులు రావాలన్న ప్రస్తుత సర్పంచులకు న్యాయం జరగాలన్న వారిని పర్సన్ ఇంచార్జిలుగా నియమించాలని కోరారు. ఈ సందర్భంగా వారికి వినతిపత్రం అందజేశారు.

గృహలక్ష్మి పథకం రద్దును వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

● గృహలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం యధావిధిగా అమలుచేయాలి ● కాంగ్రెస్ అభయహస్తంలో ప్రథమ ప్రాధాన్యత కల్పించాలని వినతి

ఏర్గట్ల, జనవరి 10: గృహలక్ష్మి పథకం రద్దును వ్యతిరేకిస్తూ బుధవారం మండలంలోని గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు కట్టుకోవడానికి రూ.3లక్షలు ఆర్థిక సహయం అందజేస్తూ ప్రొసీడింగ్ కాపీలను అందజేశారన్నారు. అందుకే మేము ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలనుకున్న సమయంలో ఎన్నికలు రావడంతో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మంజూరు చేసిన ప్రొసీడింగ్ కాపీలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఇంటి నిర్మాణం పనులు చేపట్టలేక పోతున్నం దుకు గాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో అర్హులుగా గుర్తిం చిన వారికి రూ.3 లక్షలతో పాటు ఇప్పుడున్న ప్రభుత్వం రూ.5లక్షల అదనపు ఆర్థిక సహాయం అందజేయాలని, సీఎంగారు స్పందించి తమకు న్యాయం చేయాలని వినతి ప్రతంలో పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణా నందం, ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, కోఆప్షన్ సభ్యుడు ఎండి అశ్రఫ్, ఓర్సు రాములు, అంజయ్యమోహన్, గృహలక్ష్మి లబ్ధిదారులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్: భీమ్‌గల్ పట్టణంలోని సుమంగళి చౌరస్తావద్ద బుధవారం భీమ్‌గల్ మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్య సాధింపు ధోరణితో నిలిపి వేసిందని ఆపథకాన్ని వెంటనే అమలు చేయాలని మండల బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఇట్టి రాస్తారోకో ధర్నాకు ఎటువంటి అనుమతులు లేవని భీమ్‌గల్ ఎస్సై హరిబాబు ధర్నా వద్దకు చేరుకొని బీఆర్ఎస్ నాయకులను చెదరగొట్టారు.



ఏర్గట్లలో నిరసన తెలుపుతున్న గృహలక్ష్మి లబ్ధిదారులు

అనంతరం బీఆర్ఎస్ నాయకులు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చౌటపల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, మల్లెల లక్ష్మణ్, మండల బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వం అమలుపరుస్తూ ప్రొసీడింగ్ పత్రాలను అందజేసిన గృహలక్ష్మి పథకం రద్దును కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేయడాన్ని నిరసిస్తూ బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి నిరసన వ్యక్తంచేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు కట్టుకోవడానికి రూ.3లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తూ ప్రొసీడింగ్ కాపీలను అందజేశారని ఎన్నికల కోడ్‌తో నిర్మాణ పనులు చేపట్టలేక పోయామన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం మంజూరీ చేసిన గృహలక్ష్మి పథకం ప్రొసీడింగ్ కాపీల ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో తీవ్రంగా వ్యతి రేకిస్తున్నామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం పథకంలో మొ దటి ప్రాధాన్యతగా ఇళ్లు మంజూరీ ఇచ్చి తమకు న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇదిలాఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో ప్రకారం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేసిందని బీఆర్ఎస్ నాయకులు ప్రొసీడింగ్ పత్రాలలో కనీసం అధికారుల సంతకాలు లేవని కాంగ్రెస్ నాయకులు అక్కడికి వచ్చిన లబ్ధిదారుల ముందే పరస్పర వాదనలకు దిగారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం గృహలక్ష్మి లబ్ధిదారులు ధర్నా చేశారు. గత ప్రభుత్వం గృహలక్ష్మి పథకం వల్ల మూడు లక్షల ప్రొసీడింగ్‌లను ఇచ్చారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేసిందని వారు ఆరోపించారు. దీంతో పేదలమైన మాకు అన్యాయం జరిగిందని అన్నారు. నిరుపేదలమైన మాకు కొత్త ప్రభుత్వం గృహలక్ష్మి పథకం రద్దు చేయడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని లబ్ధిదారులు ఆందోళన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళలు డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, జడ్పీటీసీ బద్దంరవి, ఏలియా, బద్దం అశోక్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ యజమానిపై చర్యలు తీసుకోవాలని వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ చింతల దాస్

ఇందల్వాయి, జనవరి 10: ఇందల్వాయి మండల కేంద్రంలోని రైల్వేగేట్ పక్కనగల వాటర్‌ప్లాంట్ ఎలాంటి అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం స్థానిక ఎంపీటీసీ చింతల దాస్ తహశీల్దార్ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వాటర్ ప్లాంట్‌ను ఎలాంటి నీటి శుద్ధి చేయకుండా డబ్బుల కోసం ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారని గ్రామ పంచాయతీ నుండి కానీ మండలం నుండి కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ కేంద్రాన్ని నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఈ ప్లాంట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇందల్వాయి, జనవరి 10: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఇందల్వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. పేద ప్రజలకు మౌలిక సదుపాయాలైన గ్యాస్ కనెక్షన్, పక్కాఇళ్లు, ఆహారభద్రత, వైద్యం, నాణ్యమైన విద్య తదితర కార్యక్రమాలను అమలు చేస్తోందని వీటిని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న పలువురితో మాట్లాడించారు. ఇఫ్కో వారు వ్యవసాయానికి అవసరమైన డ్రోన్స్ స్ప్రేయర్ ద్వారా మందుల పిచికారిని ప్రజలకు వివరించారు. వీటి ద్వారా ఎకరానికి రూ.500ల ఖర్చుతో పిచికారి చేయవచ్చని సూచించారు. వ్యవసాయ దారులు ఇలాంటి పరికరాలను ఉపయోగించుకొని లబ్ధిపొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందల్వాయి మండల అధికారులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

టీయూలో చదరంగం క్రీడా పోటీలు

డిచ్‌పల్లి,జనవరి 10: తెలంగాణ యూనివర్సిటీ అంతరకళాశాలల చదరంగం పోటీలను బుధవారం వర్సిటీ క్రీడా విభాగం డైరెక్టర్ బాలకిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ.. చదరంగం పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడకారులను సౌత్ జోన్ అంతర్ వర్సిటీ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ చెస్ ఛాంపియన్ పోటీలు 2024ను తమిళనాడులోని భారతీదాసన్ వర్సిటీలో ఈ నెల 24నుంచి 29వరకు నిర్వహిస్తున్నారని తెలంగాణ యూనివర్సిటీ నుంచి చెస్ క్రీడకారులు సందీప్, రాకేశ్, హన్మన్ గుప్త, సాయికుమార్, శివాసాయి, ఈ క్రీడలకు వెళ్తునట్లు తెలిపారు. వారి వెంట క్రీడా విభాగం సహాయాచార్యులు డా.బీఆర్ నేతా, వారికి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని బాలకిషన్ పేర్కొన్నారు.

క్రీడలతో మానసికొల్లాసం

బోధన్ రూరల్, జనవరి 10: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగప డుతాయని సాలూర సొసైటీ ఛైర్మన్ అల్లె జనార్ధన్ అన్నారు. సాలూర మండల కేంద్రంలో సీజన్ - 3 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శరీరధారుడ్యానికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రికెట్ పోటీలకు వివిధ గ్రామాల నుంచే కాక వివిధ మండలాల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధా నం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శైలేందర్, సర్పంచ్ చంద్రకళ, ఉప సర్పంచ్ డిస్కో సాయిలు, గ్రామ పెద్దలు అల్లె రమేష్‌లతో పాటు గ్రామస్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ డొల్లతనం బయటపడుతుందనే భయంతో ధర్నా

● జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, జనవరి 10: డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో పదేళ్ల పాటు ప్రజలను, పేదలను బీఆర్ఎస్ పార్టీ మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామన్న హామీ ప్రకారం ప్రజాపాలనలో దరఖాస్తులు తీసుకోవడం జరిగిందని ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ఇచ్చిన డబుల్ బెడ్ రూం అప్లికేషన్లు రద్దు చేశారని బీఆర్ఎస్ పార్టీ ధర్నాకు పిలుపునివ్వడం సిగ్గుచేటని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లకు కేవలం రూ.3లక్షలు ఇచ్చిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందని ఎక్కడ బీఆర్ఎస్ బాగోతం బయటపడుతోందని ఇప్పుడు ధర్నాల పేరుతో కొత్త డ్రామాలు ఆడుతున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో అనేక మందికి అనర్హులైన డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పెన్షన్లు, సబ్సిడీ ట్రాక్టర్లు, కల్యాణలక్ష్మీలు ఇచ్చారని ఇప్పుడు కాంగ్రెస్ అర్హులకు ఇస్తామంటే బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందన్నారు. బాల్కొండ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఐదేళ్లుగా గృహ నిర్మాణశాఖ మంత్రిగా ఉండి ఒక్క ఇళ్లు అయిన జిల్లాలో ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రజలు బీఆర్ఎస్ కల్లబొల్లి మాటలను నమ్మొద్దని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ అర్హులందరికి న్యాయం చేస్తోందన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల సమ్మె విజయవంతం

నిజామాబాద్ అర్బన్, జనవరి 10: భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఎల్ఐసీ కార్యాలయం ఎదుట గంట సేపు సమ్మె నిర్వహించారు. నగరంలోని ఎల్లమ్మగుట్టలో గల ఎల్ఐసీ కార్యాలయం ఎదుట జేఏసీ నాయకులు సక్కిసత్యనారాయణ, గంగోనె శ్రీధర్, చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ తక్షణమే ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని యాజమాన్యం కాలయాపన చేసే విధానాన్ని ఎండగట్టేందుకు ఈ సమ్మె చేస్తున్నామన్నారు. న్యూ పెన్షన్ స్కీమ్‌లో యాజమాన్యం వాటా 14 శాతానికి పెంచాలని, పాత పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులందరికి న్యాయం జరుగుతుందన్నారు. యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు ఉద్యోగులంతా ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎల్ఐసీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సక్కి ఆనంద్, శివశంకర్, సామ్రాట్, సతీష్, గంగాధర్, కల్పన, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పందిమడుగులో అక్షింతల పంపిణీ

సిరికొండ జనవరి 10:సిరికొండ మండలం పందిమడుగు గ్రామంలో అయ్యోధ్య రాములవారి పల్లకీని అలంకరించి అక్షింతలను పెట్టి ప్రభాత్ భేరీ నిర్వహించారు. గ్రామంలో ప్రధాన వీధుల్లో జై శ్రీరాం అంటు నినాదాలు చేస్తూ భజన పాటలు పాడుతూ పల్లకీలో శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికి తిరుగూ అక్షింతలను పంపిణి చేశారు.

నవీపేట: అయోధ్య శ్రీరామ క్షేత్ర ట్రస్ట్ అందించిన పవిత్ర అక్షింతలను బుధవారం మండలంలోని కోస్లీలో ఇంటింటికీ పంపిణీ చేశారు. స్థానిక హనుమాన్ మందిరంలో అక్షింతలకు పూజలు నిర్వహించి గడప గడపకు తిరిగి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు ఆరె గంగాధర్, వైస్ ఎంపీపీ హరీష్ కుమార్, సందీప్, రవి, శ్రీనివాస్, యోగేష్, సతీష్, తదితరులున్నారు.

రెగ్యులరైజ్ కోసం మంత్రి సీతక్కకు వినతి

డిచ్‌పల్లి, జనవరి 10: తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డా.దత్తహరి బుధవారం మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజ్ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని మంత్రిని కలిసి ఔట్ సోర్సింగ్ ప్రతినిధులు కోరారు.మంత్రిని కలిసినవారిలో దత్తహరి, బికోజీ, సురేశ్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీశైలం, రాజేశ్వర్, పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

రెంజల్,జనవరి10: రెంజల్ మండలంలోని కూనేపల్లి గ్రామానికి చెందిన సుద్ద సతీష్(25)అనే వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారని రెంజల్ ఇన్‌చార్జి ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..కూనేపల్లి గ్రామానికి చెందిన సతీష్ మంగళవారం రోజున తనపాప యొక్క బారసాల కార్యక్రమం జరుపగా మద్యం తాగి ఇంట్లోకి రాగా బంధువులు మద్యం ఎందుకు తాగావని అడుగగా భార్యతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వచ్చి తన బంధువైన అన్నం నాగరాజు అనే వ్యక్తితో కలిసి గ్రామ శివారులోని భీంగుంట చెరువు వైపు వెళ్లగా సాయంత్రం 4గంటల సమయంలో సతీష్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తన బంధువైన నాగనాజు చూసి వెంటనే కుటుంబ సభ్యులకు తెలుపగా కుటుంబ సభ్యులు చెరువు దగ్గరికి వెళ్లిచూడగా నీటిలోమునిగిపోయి ఉన్నాడు.బుధవారం రోజునఉదయం జాలర్లతోచెరువులో వెతికించగా సతీష్‌శవం లభించిందని తెలిపారు. భార్యసునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

బోధన్‌రూరల్, జనవరి 10: కోటగిరి మండలం సుంకిని గ్రామానికి చెందిన గంగారం అనే వ్యక్తి అదృశ్యం పట్ల బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదు చేసి నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గంగారంను హైదరాబాద్‌కు చెందిన నవనాథ్ అనే వ్యక్తి పనుల నిమిత్తం పది రోజుల క్రితం హైదరాబాద్ తీసుకెళ్లాడని, తిరిగి ఈనెల 1వ తేదీన బోధన్ బస్టాండ్‌లో వదిలి వెళ్లినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి గంగారాం తన స్వగ్రామానికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు విచారించగా ఆచూకి లభించక పోవడంతో బుధవారం బోధన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గంగారాం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, గంగారాం అదృశ్యంపై అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

తడపాకల్‌లో ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్గట్ల, జనవరి 10: మండలంలోని తడపాకల్ గ్రామంలో బుధవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న టాక్టర్‌ను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.మండల అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

రెంజల్,జనవరి10: రెంజల్ మండల సర్వసభ్య సమావేశం బుధవారం మండ పరిషత్ అధ్యక్షురాలు రజిని కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన శాఖలకు సంబంధించిన విషయాలపై చర్చించి మిగత శాఖలను కొనసాగించకుండానే మండల సర్వసభ్య సమావేశం ముగించారు. రెంజల్ నుంచి దండిగుట్ట మాటు కాలువ నిర్మాణ పనుల్లో అధికారుల జాప్యం జరుగుతుందని పలుమార్లు దృష్టికి తీసుకువచ్చిన ఫలితం లేకుండాపోయిందని కోఆప్షన్ సభ్యుడు అంతయ్య సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులు, టీచరు పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి తెలిపారు. రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులోనే ఉన్నాయని కావాల్సిన రైతులు సొసైటీల వద్ద కొనుగోలు చేసుకోవాలని వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మేక విజయ సంతోష్, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ రాంచందర్, వైస్ ఎంపీపీ యోగేష్, సూపరిండెంట్ శ్రీనివాస్, ఎంపీఓ గౌస్, సర్పంచ్‌లసంఘం మండల అధ్యక్షుడు రమేష్ కుమార్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రజిని కిషోర్


ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు


సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు


ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్


ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని


ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి


ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి


సినీనటి అనన్య


ముగ్గులు వేస్తున్న మహిళలు



అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

ఘనంగా ఎస్ఎస్ఆర్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

నవీపేట,జనవరి10: మండలంలోని జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్య గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానం పొందాలని, తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లులు సైతం నృత్యాలు చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డీఈవో దుర్గాప్రసాద్, నిజామాబాద్ అడిషనల్ డీసీపీ జయరాంలతో పాటు సీఈవో హరితగౌడ్, ప్రిన్సిపాల్ భాస్కర్, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు భేటీ బచావో.. భేటీ పడావోపై శిక్షణ

నవీపేట,జనవరి10: మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమంపై ఓరియన్‌టేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధలక్ష్మి, భాగ్యలక్ష్మిలు తెలిపారు. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, ఐకేపీ సిబ్బందితో పాటు అంగన్‌వాడీ టీచర్లు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

ఓటు అమ్ముకుంటే ప్రశ్నించే హక్కును కోల్పోతారు

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి


ఆలూర్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జనవరి 10: ఎన్నికల సమయంలో డబ్బులు తీసుకొని ఓట్లు వేస్తే ప్రశ్నించే హక్కు కోల్పోతారని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలూర్ మండల కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల వేళ చివరి రెండు రోజుల పాటు తమ ఇంటి తలుపులు మూసి ఉంచితే ఐదేళ్ల పాటు సమస్యలపై నాయకులను, పాలకులను నిలదీయవచ్చన్నారు. అర్హులైన వారందరికి పింఛన్లు, ఇళ్ల నిర్మాణాలు అందేలా చూస్తామన్నారు. ఆర్టీసీ వారికి లీగల్ నోటీసులు ఇచ్చామని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి తెలిపారు. గత నెల రోజులుగా డొంకేశ్వర్, డీకంపల్లి గ్రామాలకు బస్సులు నడపడానికి సాకులు చెబుతున్నారని, అదే విధంగా బస్టాండ్‌లో మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించారన్నారు. ఆర్టీసీ వారు డబ్బులు లేవన్న వంకతో ప్రజలకు ఇబ్బందులు కలిగించరాదన్నారు. ఐదేళ్లలో ఆర్మూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఇందుకు కేంద్రం నుంచి రూ.200కోట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రూ.300 కోట్లు మంజూరు చేయాలని కోరుతామని వీటితో ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం శక్తివంతంగా తయారవుతుందని, రాష్ట్రంలో కూడా కొత్త ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోందని ఆశిస్తున్నామన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో అర్హులైన వారందరికి ఇళ్లు నిర్మించిన తర్వాత తాను రాజకీయల నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. ఈ ఐదేళ్లలో నియోజక వర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నానన్నారు. గ్రామాలలో కుల,మతాలకు అతీతంగా అందరు కలిసి మెలిసి ఉండాలని, ఎలాంటి విద్వేశాలకు తావువివ్వ వద్దన్నారు. ఇటీవల కొన్ని వీడీసీలపై ఫిర్యాదులు వచ్చాయని, ఇక ముందు ఇలాంటి ఫిర్యాదులు రాకుండా గ్రామాలలో ఐకమత్యంతో అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. అధికారులను గౌరవించి వారికి సహకరించాలని ప్రజలను కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన వారందరు కేంద్ర ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అధికారులు ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆలూర్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌ల వద్ద ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడమే గాకుండా అర్హులైన వారికి వెంటనే లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల పోస్టర్‌లను ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కల్లెం మోహన్, ఉపసర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ తంబురి శ్రీనివాస్, కొడిగెల శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ నరేష్, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

ఆర్మూర్ పట్టణంలోని టీచర్స్‌కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో పదిశాతం ప్రభుత్వ భూమి కబ్జాకు గురి కాకుండా చూడాలని, ఆ స్థలంలో పార్కు, జీమ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాలనీవాసులు రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి, విజయానంద్, ధనుంజయ్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన

మోస్రా,జనవరి10: మోస్రా మండలంలోని చింతకుంట గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పోలీష్ కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మత్తుపదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలతో విద్యార్థులు తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్ని పోలీస్ సిబ్బంది, టీచర్లు ఉన్నారు.


చేపూర్ క్షత్రీయ పాఠశాలలో విజ్ఞాన మేళ

ఆర్మూర్‌రూరల్, జనవరి 10: ఆర్మూర్ మండలం చేపూర్‌లోని క్షత్రీయ పాఠశాలలో బుధవారం విజ్ఞానమేళ నిర్వహించారు. విజ్ఞానమేళలో క్షత్రీయ విద్యాసంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ ప్రారంభించారు. విజ్ఞాన మేళలో విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించిన 356 నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ విజ్ఞాన మేళలో వారు పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో దాగి వున్న ప్రతిభ వెలుగుచూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, ఉపాధ్యక్షుడు అల్జాపూర్ లక్ష్మీనారాయణ, పాఠశాల డైరెక్టర్‌లు ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

రాణా నుంచి పారిపోయిన దొంగ పట్టివేత

డిచ్‌పల్లి, జనవరి 10: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ నుంచి తప్పించుకొని పారిపోయిన హర్యాణకు చెందిన సోయల్ గొలుసు దొంగ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. బుధవారం నిర్మల్ శివారులో గల టోల్ ప్లాజా వద్ద మంగళవారం రాత్రి పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో డిచ్‌పల్లి సర్కిల్ పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు మంగళవారం ఉదయం స్టేషన్ లోని బాత్రూం కిటికీ పగలగొట్టి నిందితుడు తప్పించుకున్న విషయం తెలిసిందే. నిందితుడిని పట్టుకునేందుకు 150 మంది పోలీసులునిజామాబాద్,ఆదిలాబాద్ జిల్లాలోగాలింపు చేపట్టారు.

పారిశుధ్య, ఇంజనీర్ అధికారులతో సమీక్షా సమావేశం


అధికారులతో సమీక్షిస్తున్న మేయర్

సుభాష్‌నగర్, జనవరి 10: నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో గల మేయర్ ఛాంబర్‌లో మున్సిపల్ ఇంజనీర్ అధికారులు, పారిశుధ్య సిబ్బందితో నగర మేయర్ దండు నీతూకిరణ్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా విషయంలో శ్రద్ధ వహించాలని నీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెత్త నిర్వహణపై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు.ఈ సమావేశంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ మురళిమోహన్‌రెడ్డి, ఇంజనీర్లు మురళి, శంకర్, సల్మాన్‌ఖాన్, ఇంచార్జి ఎంహెచ్‌వో సాజిద్‌అలీ, సానిటరీ ఇన్స్‌పెక్టర్లు ప్రభుదాస్, సల్మాన్‌రాజ్, ప్రశాంత్, శ్రీకాంత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'దాడితో కాంగ్రెస్‌కు సంబంధం లేదు'

డిచ్‌పల్లి,జనవరి 10: సుద్దులం గ్రామానికి చెందిన స్కైలబ్‌రెడ్డి పై దాడి కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎటువంటి సంబంధం లేదని దాడి స్కైలబ్‌రెడ్డి మరో వ్యక్తి మధ్య వ్యక్తిగత విషయాలతోనే జరిగిందని, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఒకప్రకటనజారీ చేశారు. కాంగ్రెస్ పార్టీని బాద్నం చేయడానికే స్కైలబ్‌రెడ్డి తమ పార్టీ పై తప్పుడు ఆరోపణలు చేశాడని ఈ విషయంలో స్కైలబ్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం చెందాలి



మాట్లాడుతున్న పీడీ చందర్ నాయక్

డిచ్‌పల్లి, జనవరి 10: నిజామాబాద్ జిల్లాలో ఇంత వరకు స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా లేని వారిని గుర్తించి వారిని సంఘాల్లో చేర్పించి ఆర్థిక పరిపుష్టి కల్పించేల లబ్ధి చేకూర్చాలని డీఆర్‌డీవో పీడీ చందర్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం డిచ్‌పల్లి టీటీడీసీలో 76వ జిల్లా సమాఖ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు నూతన సంవత్సరంలో ఆర్థిక పరిపుష్టి సాధించేలా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ద్వార వచ్చే రుణాలను సద్వినియోగం చేసుకొని సంఘాల పరిపుష్టిత చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీడీ మధుసుధన్, సెర్ప్ ఈడీవెంకట్,డీపీఎంలు శ్రీనివాస్,సంధ్యరాణి, నీలిమా, సాయిలు, రామ్‌దాస్, ఏపీఎం రవికుమార్, సరోజిని, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖిల్లా, జనవరి 10:జిల్లాలో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో చైన్ స్నాచర్లతో పాటు వాహనాలు దొంగిలిస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర వ్యక్తులను జక్రాన్‌పల్లి పోలీసులు అరెస్టు చేసినట్లు నిజామాబాద్ ఏసీపీ ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం వివరాలను ఆయన ఛాంబర్‌లో వెల్లడించారు. హర్యానా రాష్ట్రానికి చెందిన సాహిల్‌ఖాన్, మహ్మద్ అర్షద్‌లు డ్రైవర్‌లుగా పనిచేస్తూ దొంగతనాలకు పాల్పడుతుంటారని తెలిపారు. జక్రాన్‌పల్లి పోలీసులు మంగళవారం రాత్రి అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వీరిద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. ఈనెల 4న మధ్యాహ్నం జక్రాన్‌పల్లి మండలం వేంకటేశ్వర కాలనీలో స్వర్ణ అనే మహిళ ఒంటరిగా వెళ్తుండగా బైక్‌పై వచ్చిన వారిద్దరు ఆమె మెడలోంచి రెండు తులాల పుస్తెలతాడు లాక్కొని వెళ్లారు. ఇందల్వాయి మండలం చంద్రయాన్‌పల్లి బస్టాప్ వద్ద కిరాణాషాపులో ఒంటరిగా ఉన్న మహిళ మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసును అపహరించారన్నారు. అదేరోజు జక్రాన్‌పల్లి మోడల్ స్కూల్ వద్ద పాల్వా జయశ్రీ మెడలోంచి బంగారు గొలుసు అపహరించారు. జల్సాలకు అలవాటు పడ్డ వీరు ఒంటరిగా ఉన్న మహిళలను గుర్తించి వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లేవారని అన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. డిచ్‌పల్లి సీఐ కృష్ణ, జక్రాన్‌పల్లి ఎస్సై కృష్ణ, సిబ్బంది తిరుపతి, ప్రసాద్, రాజేశ్వర్, భూపతి, భూమేష్, సతీష్, రాము, సర్దార్, రాములు కలిసి ఇద్దరు చైన్‌స్నాచర్లను పట్టుకోవడంలో నైపుణ్యత చాటడంతో పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ అభినందించారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, జనవరి 10: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లో బుధవారం నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీవో సింహాచలం, నాబార్డు డీడీఎం ప్రవీణ్‌కుమార్, సీఈవో నాగభూషణం,డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి,సాయికుమార్,శరత్,శాంతీశ్వర్ పటేల్, భూమన్న, లింగయ్య, మోతీలాల్, శంకర్, ఆనంద్‌లు పాల్గొన్నారు.